సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం : 7 : అక్టోబర్ : 2024



కరెంట్‌తో హతమార్చేలా?
ఒడ్డు రామారం అటవీ ప్రాంతంలో విద్యుదాఘాతంతో వన్యప్రాణులను హతమార్చేందుకు యత్నిస్తున్నారు. 8లో



పత్తి కొనుగోళ్లకు సీసీఐ సై !
పత్తి బేళ్లకు జిన్నింగ్ మిల్లులకు టెండర్లు ఖరారు కావడంతో సీసీఐ పత్తి కొనుగోళ్లకు సన్నద్ధమవుతోంది. 8లో

గరిష్టం / కనిష్టం
33° / 23°

వాతావరణం
జిల్లాలో సోమవారం ఉష్ణోగ్రతలు కొద్దిమేర పెరుగుతాయి. మధ్యాహ్నం తర్వాత ఒకటి, రెండు చోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

పండుగకు ముందే పదవులొచ్చేనా?!

నామినేటెడ్ పోస్టుల కోసం ఆశావహుల నిరీక్షణ
- ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో ఐదుగురికి అవకాశం
- జాబితాలో మరో ఇద్దరికి స్థానం ఉంటుందని ప్రచారం
- మంత్రులు, ముఖ్య నేతల చుట్టూ ప్రదక్షిణలు
- పంచాయతీ ఎన్నికల నేపథ్యాన ధీమా



సాక్షి ప్రతినిధి, ఖమ్మం: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలైంది. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో ఐదుగురికి రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పదవులు దక్కాయి. ఇవికాక ఇంకా ఒకరిద్దరికి పదవులు లభిస్తాయని.. ఈ పదవులను దసరా పండుగకు ముందే భర్తీ చేస్తారనే ఊహాగానాలతో ఆశావహులు జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు, ముఖ్య నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మరోవైపు గ్రామపంచాయతీ ఓటర్ల జాబితాలు సిద్ధమైనందున ఎప్పుడైనా ఎన్నికల నగారా మోగే అవకాశముంది. ఆ లోపే నామినేటెడ్ పదవులను భర్తీ చేస్తే ఫలితం ఉంటుందనే ఆలోచనలో పార్టీ అధిష్టానం ఉన్నట్లు తెలుస్తోంది.

రెండు విడతల్లో ఐదు పదవులు..
ఇప్పటికే రెండు విడతలుగా నామినేటెడ్ పోస్టులు భర్తీ చేయగా ఉమ్మడి జిల్లాలో ఐదుగురికి అవకాశం దక్కింది. రాయల నాగేశ్వరరావును రాష్ట్ర వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా, పొదెం వీరయ్యను ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా, మువ్వా విజయ్‌బాబును ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా, నాయుడు సత్యనారాయణను హ్యాండీక్రాఫ్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా, నూతి శ్రీకాంత్‌ను బీసీ కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా నియమించారు. వీరు చాన్నాళ్ల క్రితమే బాధ్యతలు స్వీకరించి శాఖాపరమైన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఇంకా ఎవరికి?
రాష్ట్ర వ్యాప్తంగా పలు నామినేటెడ్ పదవులు ఖాళీగా ఉండడంతో త్వరలో భర్తీ చేస్తారన్న సమాచారంతో ఆశావహులు స్పీడ్ పెంచారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుల ముఖ్య అనుచరులు ఈ పదవుల కోసం పోటీ పడుతున్నారు. అలాగే రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి అనుచరులు సైతం రేస్‌లో ఉన్నారు. అయితే ఇప్పటికే ఐదు పదవులు దక్కించుకున్న నేతలు ఏ మంత్రికి అనుచరులో ఆరా తీస్తూ.. మిగతా మంత్రుల అనుచరులు ఈసారి తమకే బెర్త్ ఖాయమనే ధీమా వ్యక్తం చేస్తున్నారు. కానీ గతంలోనే ఐదుగురికి పదవులు ఇచ్చినందున ఈసారి ఒకరికా లేక ఇద్దరికి అవకాశం ఉంటుందా.. అవి ఎవరికి దక్కుతాయనే ఉత్కంఠ నెలకొంది.

ఎక్కడా అసంతృప్తి లేకుండా..
సంస్థాగతంగా పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా కాంగ్రెస్ కార్యాచరణ రూపొందించింది. నూతన పీసీసీ అధ్యక్షుడిగా నియామకం తర్వాత జిల్లాల వారీగా సమీక్షలు జరుగుతున్నాయి. త్వరలో ఉమ్మడి ఖమ్మం జిల్లా నేతల సమావేశం కూడా గాంధీభవన్‌లో జరగనుంది. ఇలా పార్టీని క్షేత్ర స్థాయిలో పటిష్టం చేస్తూ పంచాయతీ ఎన్నికలకు సన్నద్ధం కావాలన్న ఆలోచనలో పార్టీ నేతలు ఉండగా.. పంచాయతీ ఎన్నికల్లో మండలాల సమన్వయం బాధ్యతలను ముఖ్య నేతలకు అప్పగించనున్నారు. క్షేత్ర స్థాయిలో పార్టీకి బలమైన మద్దతుదారులు సర్పంచ్‌లుగా నెగ్గితే వచ్చే ఎన్నికల సమయాన లాభం జరుగుతుందని భావిస్తున్నారు. దీంతో ఎక్కడా అసంతృప్తి ఎదురుకాకుండా రాష్ట్ర, జిల్లా స్థాయి నామినేటెడ్ పదవుల విషయంలో ముఖ్యనేతలు ఆచితూచి అడుగులు వేస్తున్నారు. నామినేటెడ్ పదవులు దక్కించుకున్న వారే కాక మిగతా నేతలు సమన్వయంతో ముందుకెళ్తేనే మెజార్టీ గ్రామపంచాయతీలను ఖాతాలో వేసుకోవచ్చన్న చర్చ కాంగ్రెస్ పార్టీలో జరుగుతోంది.

జాబితా పెద్దదే...
నామినేటెడ్ పదవులు ఎన్ని వస్తాయన్న విషయాన్ని పక్కన పెడితే.. ఉమ్మడి జిల్లాలో ఆశావహుల జాబితా మాత్రం భారీగానే ఉంది. సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి భర్త డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ పదవి కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, వైరా నియోజకవర్గం నుంచి బొర్రా రాజశేఖర్, కట్ల రంగారావు, భద్రాచలం నియోజకవర్గం నుంచి బుడగం శ్రీనివాస్, మధిర నియోజకవర్గం నుంచి వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మందడపు నాగేశ్వరరావు, పసుపులేటి దేవేంద్రం, డాక్టర్ కోట రాంబాబు, ఐలూరు వెంకటేశ్వరరెడ్డి, పైడిపల్లి కిషోర్ పదవుల రేస్‌లో ఉన్నారు. ఇక ఖమ్మం నియోజకవర్గం నుంచి కమర్తపు మురళి, సాధు రమేష్‌రెడ్డి, ముదిరెడ్డి నిరంజన్‌రెడ్డి, జావేద్, మద్ది శ్రీనివాస్‌రెడ్డి, పాలేరు నుంచి కన్నెగంటి శివరామకృష్ణ, పినపాక నియోజకవర్గంలో తుళ్లూరి బ్రహ్మయ్య, బట్టా విజయ్, కొత్తగూడెం నియోజకవర్గం నుంచి పోట్ల నాగేశ్వరరావు, నాగా సీతారాములు, ఎడవల్లి కృష్ణ, ఇల్లెందు నియోజకవర్గంలో మేకల మల్లిబాబుయాదవ్, డాక్టర్ జి.రవి నామినేటెడ్ పదవుల కోసం తమవంతు ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు.

ట్రాక్టర్‌పై ఎమ్మెల్యే పయనం..!

ఆ తర్వాత కొంతదూరం కాలినడకన..



ట్రాక్టర్‌పై గంద్రబంధం గ్రామానికి వెళ్తున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

పాల్వంచరూరల్ /కొత్తగూడెంరూరల్: అది జిల్లా కేంద్రానికి పక్కనే ఉన్న లక్ష్మీదేవిపల్లి – పాల్వంచ మండలాల సరిహద్దులోని గంద్రబంధం గ్రామం. ఆ ఊరికి వెళ్లాలంటే కాలినడక, ఎడ్ల బండే దిక్కు. కాదంటే కొంతదూరం ట్రాక్టర్‌లో వెళ్లొచ్చు. సీపీఐ మాజీ సర్పంచ్ తాటి రాధ భర్త వెంకటేశ్వర్లు ఇటీవల మృతిచెందగా, ఆయన కుటుంబాన్ని పరామర్శించేందుకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆదివారం బయలుదేరారు. కిన్నెరసాని పరీవాహక అటవీ ప్రాంతంలో ఉన్న ఆ గ్రామానికి వెళ్లేందుకు కూనంనేని ఓ ట్రాక్టర్ ఎక్కారు. కొంతదూరం వెళ్లాక వాగు ఇసుకలో ట్రాక్టర్ కదలలేని పరిస్థితి ఏర్పడగా, కార్యకర్తలు ముందుకు నెట్టేందుకు ప్రయత్నించారు. అది సాధ్యం కాకపోవడంతో ట్రాక్టర్ దిగి ఇసుకలో నడుచుకుంటూ సుమారు రెండు కిలోమీటర్ల దూరంలోని గ్రామానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా తమ కష్టాలను గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఏకరువు పెట్టగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, లక్ష్మీదేవిపల్లి మండల కార్యదర్శి చంద్రగిరి శ్రీను, దిటి లక్ష్మి పతి, జలీల్‌పాషా, రాంబాబు, ధారా శ్రీను, రాజాబాబు, కంటి సత్యం, సుమన్, పారిపర్తి రాజు, రాంబాబు పాల్గొన్నారు.

చీరల పంపిణీ పకడ్బందీగా చేపట్టాలి

భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్

భద్రాచలం/భద్రాచలంఅర్బన్: హ్యాండ్లూమ్ కోపరేటివ్ సొసైటీ ద్వారా సరఫరా చేసిన చీరలను లబ్ధిదారులకు పంపిణీ చేయాలని భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఐకేపీ ఏపీఎంల సహకారంతో గిరిజన లబ్ధిదారులను గుర్తించి చీరల పంపిణీ సక్రమంగా నిర్వహించాలన్నారు. జిల్లాలో సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ మహిళలకు 1,80,642 చీరలు, 18 సంవత్సరాలు దాటిన గిరిజన మహిళలు 1,48,263 మందికి చీరలు పంపిణీ చేస్తామని తెలిపారు. చీరల పంపిణీ కార్యక్రమానికి మండలాల వారీగా ప్రత్యేక అధికారులను నియమించినట్లు తెలిపారు.

ప్రశాంతంగా 'ఓపెన్' పరీక్షలు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలో జరుగుతున్న ఓపెన్ పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు నాలుగో రోజు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. ఇంటర్మీడియట్ పరీక్షలకు 129 మందికి గాను 109 మంది హాజరు కాగా 20 మంది గైర్హాజరయ్యారు. పదో తరగతి పరీక్షకు 55 మందికి గానూ 36 మంది హాజరు కాగా 19 మంది గైర్హాజరయ్యారని జిల్లా విద్యాధికారి ఎం.వెంకటేశ్వరాచారి తెలిపారు.

ఈఎస్‌ఐలో మెరుగైన వైద్యసేవలందాలి

రాష్ట్ర కార్మిక, ఉపాధి, శిక్షణ, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సంజయ్‌కుమార్



కార్మిక శాఖ అధికారికి సమస్యలను విన్నవిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

బూర్గంపాడు: ఈఎస్‌ఐ ఆస్పత్రులలో కార్మికులకు, వారి కుటుంబాలకు మెరుగైన వైద్యసేవలను అందించాలని రాష్ట్ర కార్మిక, ఉపాధి, శిక్షణ, పరిశ్రమల ప్రిన్సిపల్ సెక్రటరీ సంజయ్‌కుమార్ ఆదేశించారు. సారపాకలోని ఈఎస్‌ఐ డిస్పెన్సరీని ఆదివారం ఆయన తనిఖీ చేశారు. కార్మిక కుటుంబాలకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. మందులు లభ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. డిస్పెన్సరీలో అవసరమైన వసతులపై నివేదికలివ్వాలని సూచించారు. అనంతరం ఐటీసీ పీఎస్‌పీడీ కార్మిక సంఘాల నాయకులు ప్రిన్సిపల్ సెక్రటరీని కలిసి డిస్పెన్సరీ సమస్యలను వివరించారు. శాశ్వత భవనం నిర్మించాలని, అంబులెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. సారపాక ఈఎస్‌ఐలో అందుబాటులో లేని వైద్యసేవలకు భద్రాచలం, కొత్తగూడెంలోని ఆస్పత్రులను అనుసంధానం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐటీసీ పీఎస్‌పీడీ ట్రేడ్ యూనియన్ నాయకులు కనకమేడల హరిప్రసాద్, గాదె రామకోటిరెడ్డి, గొనే రామారావు, యారం పిచ్చిరెడ్డి,సానికొమ్ము శంకర్‌రెడ్డి, బిజ్జం అశోక్‌రెడ్డి, పుల్లగొండ వీరన్న తదితరులు పాల్గొన్నారు.

గజలక్ష్మిగా జగన్మాత



గజలక్ష్మి అలంకరణలో అమ్మవారు

భద్రాచలం: చెదరని అధికారం, తరగని సంపదను ప్రసాదించే గజలక్ష్మిగా శ్రీ మహాలక్ష్మి ఆదివారం భక్తులకు దర్శనమిచ్చారు. జగన్మాతగా కీర్తిస్తూ భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. భద్రాచల శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారికి మూడో రోజు గజలక్ష్మి అలంకరణ చేశారు. అర్చకులు స్నపన తిరుమంజనం, ప్రత్యేక పూజలు, సామూహిక కుంకుమార్చన జరిపారు. చిత్రకూట మండపంలో వేద పండితులు, అర్చకులు అరణ్య కాండ పారాయణం చేశారు. కాగా నేడు అమ్మవారు ధనలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

రామయ్య కల్యాణం.. కమనీయం
బేడా మండపంలో సీతారామ చంద్రస్వామివారి నిత్యకల్యాణం కమనీయంగా జరిగింది. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు.

శ్రీలలితా త్రిపురసుందరీదేవిగా..



శ్రీలలితా త్రిపురసుందరీదేవి అలంకరణలో అమ్మవారు

పాల్వంచరూరల్: శ్రీదేవి శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు ఆదివారం శ్రీ లలితా త్రిపురసుందరీదేవి రూపంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. మండలంలోని శ్రీ కనకదుర్గ (పెద్దమ్మ తల్లి) ఆలయంలో రుత్వికులు, అర్చకులు ప్రాంతః హోమం, శ్రీలక్ష్మీగణపతి, అనుష్ఠానములు, వేదపారాయణం, నవగ్రహ జపాలు, శ్రీచక్రార్చన, మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రుద్ర హోమం, శ్రీలక్ష్మీ నారాయణస్వామి కల్యాణం, లక్ష కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఈఓ ఎన్.రజనీకుమారి పాల్గొన్నారు.

లాభాల వాటా మస్టర్‌కు ఎంతంటే..?



సింగరేణి కార్మికులు(ఫైల్)

- భూగర్భ గని కార్మికుడికి రూ.891.11
- ఉపరితల గని కార్మికుడికి రూ. 730.46
- కార్యాలయ ఉద్యోగికి రూ.683.50

సింగరేణి (కొత్తగూడెం): సింగరేణి యాజమాన్యం కార్మికులకు చెల్లించే లాభాల వాటాను మస్టర్ల వారీగా ఎంత చెల్లించేది నిర్ధారించింది. సంస్థ 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.4,701 కోట్ల లాభం సాధించగా, అందులో పర్మనెంట్ కార్మికులకు 33 శాతం రూ.788 కోట్లు, కాంట్రాక్ట్ కార్మికులకు రూ. 8 కోట్లు.. మొత్తం రూ.796 కోట్లు చెల్లించేందుకు అంగీకరించింది. లాభాల వాటా చెల్లింపులు భూగర్భ గనులు, ప్రొడక్షన్ విభాగాలు, డిపార్ట్‌మెంట్లలో పనిచేసే వారికి వేర్వేరుగా ఉంటుంది. భూగర్భ గనుల్లో పనిచేసేవారికి మిగతా వారికంటే ఎక్కువగా చెల్లిస్తారు. భూగర్భ గనుల్లో పనిచేసే కార్మికుడికి మస్టర్‌కు రూ.891.11 చొప్పున, సర్ఫేస్ విభాగాల్లో పనిచేసే వారికి రూ.730.46 పైసలు, కార్యాలయాలల్లో పనిచేసే వారికి రూ. 683.50 చొప్పున చెల్లించాలని యాజమాన్యం నిర్ణయించింది. గత ఆర్థిక సంవత్సరంలో పనిచేసిన మస్టర్ల ఆధారంగా లెక్కించి కార్మికుల బ్యాంక్ అకౌంట్లలో జమ చేయనుంది. లాభాల వాటాలో 85 శాతం కార్మికుడి అటెండెన్స్‌పై రూ. 679.03 కోట్లు, 14శాతం గ్రూప్ ఇన్సూరెన్స్‌పై రూ.111.45 కోట్లు, ఒక శాతం ఇన్సెంటివ్‌పై రూ. 5.57 కోట్లను యాడ్‌చేసి మస్టర్ రేట్‌ను ఫిక్స్ చేసినట్లు అధికారులు తెలిపారు. లాభాల వాటా ఈ నెల 7న లేదా 9న చెల్లిస్తారా అనే విషయంలో స్పష్టత లేదు. అయితే సోమవారమే చెల్లించేందుకు కార్పొరేట్ కార్యాలయంలో అధికారులు ఆదివారం రాత్రి వరకు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం.

అత్యధికంగా శ్రీరాంపూర్ కార్మికుడికి రూ.3.40 లక్షలు
లాభాల వాటాలో అత్యధిక మొత్తం అందుకునే కార్మికుల వివరాలను యాజమాన్యం వెల్లడించింది. టాప్ టెన్‌లో శ్రీరాంపూర్ ఏరియాలో 8 మంది కార్మికులు, రామగుండం, మందమర్రి ఏరియాల్లో ఒక్కొక్కరు చొప్పున కార్మికులు ఎంపికయ్యారు. శ్రీరాంపూర్ ఏరియాలో ఎస్ఆర్‌పీ–1 ఇంక్లైన్‌లో పనిచేసే ఎస్‌డీఎల్ ఆపరేటర్ ఆసం శ్రీనివాస్ అత్యధికంగా రూ.3,40,000 అందుకోనున్నాడు. మందమర్రి ఏరియా కేకే–5 ఇంక్లైన్ గని జనరల్ మజ్దూర్ కుమ్మరి జెస్సీరాజ్ రూ.3,10,000తో రెండో స్థానంలో, శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే–5 ఇంక్లైన్ ఎస్‌డీఎల్ ఆపరేటర్ అటికం శ్రీనివాస్ రూ.3,01,000తో మూడో స్థానంలో నిలిచారు. శ్రీరాంపూర్ ఏరియా రాంటెంక్ ఇంక్లైన్ ఎలక్ట్రీషియన్ తుమ్మలపల్లి శ్రీనివాస్ రూ. 3 లక్షలు, శ్రీరాంపూర్ ఏరియా ఎస్ఆర్‌పీ–1 ఇంక్లైన్ ఎస్‌డీఎల్ ఆపరేటర్ మేడం తిరుపతి రూ.3 లక్షలు, శ్రీరాంపూర్ ఏరియా రాంటెంక్ ఇంక్లైన్ ఫోర్‌మెన్ కర్నె వెంకటేశం రూ.2,96,000, శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే–5 ఇంక్లైన్ ఎస్‌డీఎల్ ఆపరేటర్ బండారి శ్రీనివాస్ రూ.2,92,000, శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే–7 ఇంక్లైన్ కోల్ కట్టర్‌దుర్గం తిరుపతి రూ. 2,91,000, గోదావరి ఖని ఏరియా వకీల్ పల్లి గని ఓవర్‌మెన్ ఎ.వంశీకృష్ణ రూ.2,89,000, శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే–6 ఇంక్లైన్ సర్వేయర్ బర్ల మహేందర్ రూ.2,88,000 అందుకోనున్నారు.

రేషన్ దందా ఆగేదెప్పుడు..?

- రాష్ట్రాలు దాటుతున్న పీడీఎఫ్ బియ్యం
- మిల్లర్లు, రేషన్‌డీలర్లు, వ్యాపారులు కలిసి అక్రమాలు
- నిరోధించడంలో పౌరసరఫరాల శాఖ అధికారులు విఫలం



టూటౌన్ పోలీసులు పట్టుకున్న రేషన్ బియ్యం (ఫైల్)

కొత్తగూడెంఅర్బన్: పేదలకు అందాల్సిన పీడీఎఫ్ బియ్యం అర్ధరాత్రి వేళ రాష్ట్రం దాటుతున్నాయి. అక్రమాలను నిరోధించడంలో పౌరసరఫరాల శాఖ అధికారులు విఫలమవుతున్నారు. అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని జిల్లాలో పలు చోట్ల పోలీసులు పట్టుకుంటున్నారు. కానీ సివిల్ సప్లై అధికారులు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. దీంతో దళారులు రూ.లక్షల్లో వ్యాపారం చేసుకుంటూ జేబులు నింపుకుంటున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు జిల్లాలో కేవలం 40 కేసులు మాత్రమే నమోదయ్యాయి. పౌరసరఫరాల శాఖ అధికారులు, పోలీసులు, రేషన్ డీలర్లు కుమ్మక్కైనట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో కేసులు కూడా నమోదు చేయడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అర్ధరాత్రి గుట్టుచప్పుడు కాకుండా..
కొత్తగూడెం జిల్లా కేంద్రంలో అర్ధరాత్రి వేళ గుట్టుచప్పుడు కాకుండా రేషన్ బియ్యం దందా కొనసాగుతోంది. జిల్లా కేంద్రంతోపాటు మండలాల్లో కొందరు దళారులు అనధికారికంగా బియ్యం స్టాక్ పాయింట్లను ఏర్పాటు చేసుకున్నారు. డీలర్లే లబ్ధిదారుల నుంచి బియ్యం తీసుకుని డబ్బులు చెలిస్తున్నారు. కొందరు ఇంటింటికీ తిరుగుతూ రేషన్ బియ్యం కొంటున్నారు. అనంతరం దళారుల స్టాక్ పాయింట్‌కు చేర్చి, లారీల్లో అర్ధరాత్రి వేళ లారీల్లో ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. అర్ధరాత్రి 2 నుంచి 3 గంటల సమయంలో బియ్యం లోడులు బయల్దేరి పోతున్నాయి.

ఏకంగా స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేసుకుని..
కొత్తగూడెం జిల్లా కేంద్రంలో బూడిదగడ్డ, గాజుల రాజంబస్తీ, రామవరం, చిట్టిరామవరం, లక్ష్మీదేవిపల్లి, ఎదురుగడ్డ, కారుకొండ, రేగళ్ల తదితర ప్రాంతాలలో బియ్యం స్టాక్ పాయింట్లు రాజకీయ నాయకుల అండదండలతో అనధికారంగా నడుస్తున్నాయి. ఇక్కడ నుంచి ఇతర రాష్ట్రాలకు, స్థానిక మిల్లర్లకు బియ్యం సరఫరా చేస్తున్నారు. మిల్లర్లు రేషన్ బియ్యాన్ని డబుల్ పాలిష్ చేసి సన్న బియ్యంలాగా మార్చి మార్కెట్లలో విక్రయిస్తున్నారు. ఆకర్షణీయంగా ఉండే సంచుల్లో నింపి కొనుగోలుదారులను మోసం చేస్తున్నారు. రూ.25 కేజీల బియ్యం బస్తాను రూ.1300 నుంచి రూ.2000 వరకు కూడా విక్రయిస్తున్నారు. మిల్లర్, దళారీ, మార్కెట్‌లో విక్రయించే వ్యాపారి కలిసి రేషన్ బియ్యంతో సొమ్ము చేసుకుంటున్నారు. సామాన్యుల జేబులకు చిల్లులు పడుతున్నా పౌరసరఫరాల అధికారులు పట్టించుకోవడంలేదు. ఇటీవల మణుగూరులో, కొత్తగూడెం జిల్లా కేంద్రం రామవరం టూటౌన్‌లో రేషన్ బియ్యం పట్టుకున్నారు. ఇంకా పలు స్టేషన్లలో కేసులు నమోదవుతున్నాయి. సివిల్ సప్లై అధికారులు కూడా విస్తృతంగా తనిఖీలు చేపట్టి బియ్యం అక్రమ తరలింపునకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు. జిల్లాలోని 443 రేషన్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి, బియ్యం పక్కదారి పట్టకుండా చూడాలని పేర్కొంటున్నారు.

చర్యలు తీసుకుంటాం



పేదల కోసం ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా బియ్యం పంపిణీ చేస్తోంది. రేషన్ బియ్యం డీలర్లు, దళారులు, మిల్లర్లకు విక్రయించడం నేరం. పీడీఎఫ్ బియ్యం కొనుగోలు చేయడం కూడా నేరమే. అమ్మకాలు, కొనుగోలు చేసే వారిపై నిఘా ఏర్పాటు చేశాం. చర్యలు తీసుకుంటాం. –రుక్మిణి, జిల్లా సివిల్ సప్లై అధికారిణి

న్యూస్‌రీల్

రేపటి నుంచి దివ్యాంగుల ఉపకరణాల శిబిరం

సింగరేణి(కొత్తగూడెం): జిల్లాలో దివ్యాంగుల సహాయ ఉపకరణాలు అందించేందుకు ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు ఆర్టిఫిషియల్ లింబ్ మాన్యుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సహకారంతో ఎంపిక శిబిరం నిర్వహించనున్నట్లు కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తెలిపారు. ఈ నెల 8న గుండాల, 9న అశ్వారావుపేట, 10న భద్రాచలం మండల పరిషత్ కార్యాలయాల్లో, 11న పాల్వంచ ఐడీఓసీ కార్యాలయంలో శిబిరాలు జరుగుతాయని పేర్కొన్నారు. బ్యాటరీ ట్రైసైకిళ్లు, ట్రై సైకిళ్లు, వీల్ చైర్లు, వినికిడి యంత్రాలు, అంధుల చేతికర్రలు, కృత్రిమ అవయవాలు, చంక కర్రల కోసం శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. హాజరయ్యేవారు యూడీఐడీ కార్డ్, సదరమ్ సర్టిఫికెట్, ఆదాయం/రేషన్ కార్డ్, ఆధార్‌కార్డ్, 2 పాస్‌పోర్టుసైజ్ ఫొటోలు తెచ్చుకోవాలని, రవాణా సౌకర్యం అనుకూలంగా ఉన్న ప్రాంతంలోని శిబిరానికి హాజరుకావొచ్చని వివరించారు. ఇతర వివరాలకు 63019 81960, 83310 06010, 80966 97365 నంబర్లను సంప్రదించాలని కోరారు.

నేడు ప్రజావాణి

సింగరేణి(కొత్తగూడెం): కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి ప్రారంభమవుతుందని, అన్నిశాఖల జిల్లా అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు. జిల్లా ప్రజలు తమ సమస్యలపై ఫిర్యాదులు అందజేయాలని తెలిపారు.

నేడు గిరిజన దర్బార్

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న గిరిజన దర్బార్ కార్యక్రమానికి అన్ని శాఖల ఐటీడీఏ యూనిట్ అధికారులు సకాలంలో హాజరుకావాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజనులు తమ సమస్యలను వివరించి పరిష్కరించుకోవాలని సూచించారు.

కబడ్డీ అసోసియేషన్ జిల్లా కమిటీ ఎన్నిక



కబడ్డీ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు

కొత్తగూడెంటౌన్: కబడ్డీ అసోసియేషన్ జిల్లా నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. కొత్తగూడెంలో జరిగిన సమావేశంలో ఈఎన్నిక జరిగినట్లు రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ కె.క్రిష్టఫర్ తెలిపారు. జిల్లా అసోసియేషన్ చైర్మన్‌గా చీకటి కార్తీక్, అధ్యక్షుడిగా జారె ఆదినారాయణ (అశ్వారావుపేట ఎమ్మెల్యే), ప్రధాన కార్యదర్శిగా స్వాతిముత్యం, ట్రెజరర్‌గా కురకుల నరేష్, వైస్ ప్రెసిడెంట్‌గా లేళ్ల వెంకటరెడ్డి, ఎం.పాస్నేట్, వరుస వెంకటేశ్వర్లు, సారేపల్లి శేఖర్, కాటంరెడ్డి స్టీఫెన్ ఎన్నికయ్యారని పేర్కొన్నారు. ఈ ఎన్నికలకు ఒలింపిక్ అసోసియేషన్ నుంచి హనుమంతరావు, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ నుంచి తిరుమలరావు పరిశీలకులు వ్యవహరించారు.

జిల్లా ఉపాధ్యక్షుడికి సన్మానం
జూలూరుపాడు: కబడ్డీ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడిగా జూలూరుపాడుకు చెందిన లేళ్ల వెంకటరెడ్డిని కొత్తగూడెం పీఆర్ ఫంక్షన్ హాల్ జరిగిన కార్యక్రమంలో పలువురు ఘనంగా సన్మానించారు.

హోరాహోరీగా ఫుట్‌బాల్ పోటీలు



తలపడుతున్న ఖమ్మం- మహబూబ్‌నగర్ జట్లు

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం సింగరేణి ప్రకాశం స్టేడియంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి అండర్–17 విభాగం ఫుట్‌బాల్ పోటీలు ఆదివారం రెండో రోజు హోరాహోరీగా సాగాయి. అతిథ్య ఉమ్మడి ఖమ్మం జిల్లా జట్టు సెమీఫైనల్‌కు చేరుకుంది. మహబూబ్‌నగర్ జట్టుతో తలపడిన ఖమ్మం జట్టు 3–0 గోల్స్ సాధించి విజయాన్ని అందుకుంది. నవభారత్ పాఠశాలలో జరిగిన పోటీల్లో రంగారెడ్డి జిల్లా జట్టు వరంగల్ జట్టుపై 3–0 గోల్స్ తేడాతో గెలుపొంది సెమీఫైనల్‌కు చేరుకుంది. మరో మ్యాచ్ రంగారెడ్డి జిల్లా, మెదక్ జిల్లా జట్ల మధ్య పోటీ జరిగా 1–1 గోల్స్‌తో డ్రాగా ముగిసింది. సోమవారం చివరి రోజు అన్ని నాకౌట్ పోటీలు ఉంటాయని జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వాహక కార్యదర్శి వాసిరెడ్డి నరేష్‌కుమార్ తెలిపారు. బట్టు ప్రేమ్‌కుమార్, యనమదల వేణుగోపాల్, యుగంధర్, శ్రీనివాస్, మంజీలాల్, సీతాదేవి, సుజాత, విద్యాసాగర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉల్లాసంగా ఉత్సాహంగా..!



క్రికెట్ ఆడుతున్న మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి

మణుగూరుటౌన్: నిరంతరం నేర నియంత్రణతో పాటు వివిధ కేసుల పరిష్కారంలో బిజీబిజీగా గడిపే డివిజన్ పోలీసులు ఆదివారం ఉదయం క్రికెట్ ఆడి సేదదీరారు. స్థానిక యువతతో మమేకమై బ్యాట్ పట్టారు. హోదాలు మరిచి ఫోర్‌లైన్‌లో బంతిని ఆపేందుకు కుస్తీ పడ్డారు. మణుగూరు గ్రౌండ్‌లో గంట్ల కోటేశ్వరరావు జ్ఞాపకార్థం గంట్ల రమేశ్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న దసరా క్రికెట్ పోటీలకు డివిజన్ పోలీస్ క్రికెట్ జట్టు పేరు ఇవ్వగా ఆదివారం ఉదయం పోలీస్ వర్సెస్ లోకల్ సివిల్ జట్లు తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న పోలీస్ టీంలో డీఎస్పీ వంగా రవీందర్‌రెడ్డి, అశ్వాపురం సీఐ అశోక్‌రెడ్డి, ఏడూళ్ల బయ్యారం ఎస్‌ఐ రాజ్‌కుమార్, మణుగూరు ఎస్‌ఐ రంజిత్‌లు, సిబ్బంది ఉల్లాసంగా ఆడి ఉత్సాహంగా ఆటల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. యువతలో క్రీడా నైపుణ్యాలు వెలికితీయడానికి పోటీలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొంటూ నిర్వాహకులను అభినందించారు.

తప్పుడు ధ్రువపత్రాలతో ఉపాధ్యాయుల బదిలీ

మరో చోటుకు బదిలీ చేసిన ఉన్నతాధికారులు

ఇల్లెందురూరల్: ఐటీడీఏ పరిధిలోని ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియలో ఇరువురు ఉపాధ్యాయులు తప్పుడు మెడికల్ ధ్రువపత్రాలు వినియోగించినట్లుగా ఉన్నతాధికారులు నిర్ధారించారు. జీఓఎంఎస్ నం.17కు అనుగుణంగా కరకగూడెం ఆశ్రమ పాఠశాల నుంచి రవి, బండారిగుంపు ఆశ్రమ పాఠశాల నుంచి లేగ్యా ఎస్‌జీటీలుగా మండలంలోని చెన్నంగులగడ్డ ఆశ్రమ పాఠశాలకు బదిలీపై వచ్చారు. ఇరువురు ఉపాధ్యాయులు జీఓఎంఎస్‌కు విరుద్ధంగా తప్పుడు పత్రాలతో తమకు అనుకూలంగా బదిలీ పొందారని ఐటీడీఏ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో విచారణ చేపట్టి ఇరువురిని మరోసారి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. లేగ్యాను ఏజీహెచ్‌ఎస్ అనంతారం, రవిని కావడిగుండాల ఆశ్రమ పాఠశాలకు ఎస్‌జీటీలుగా బదిలీ చేశారు. ఇరువురిని తక్షణమే రిలీవ్ చేయాలని ఆదేశిస్తూ చెన్నంగులగడ్డ ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి జారీ చేసిన ఉత్తర్వుల్లో ఉన్నతాధికారులు పేర్కొన్నారు.

కిన్నెరసానిలో సండే సందడి



బోటు షికారు చేస్తున్న జడ్జి భానుమతి

పాల్వంచరూరల్: మండల పరిధిలోని పర్యాటక ప్రాంతమైన కిన్నెరసానికి ఆదివారం జిల్లా నలుమూలల నుంచే కాకుండా పొరుగు జిల్లాల నుంచీ పర్యాటకులు తరలివచ్చి సందడి చేశారు. ఈ సందర్భంగా డ్యామ్ వద్ద నుంచి జలాశయాన్ని, డీర్ పార్కులోని దుప్పులను వీక్షించారు. 553 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.19,010 ఆదాయం లభించగా, 250 మంది బోటు షికారు చేయడం ద్వారా టూరిజం కార్పొరేషన్ సంస్థకు రూ.15,000 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

కిన్నెరసానిని సందర్శించిన జడ్జి..

పర్యాటక ప్రాంతమైన కిన్నెరసానిని కొత్తగూడెం జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ జడ్జి జి.భానుమతి తన కుటుంబసభ్యులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా డీర్ పార్కులోని దుప్పులను వీక్షించి జలాశయంలో బోటు షికారు చేశారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

అశ్వారావుపేట : మండల పరిధిలోని ఊట్లపల్లి చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఏపీలోని ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంకు చెందిన రామిశెట్టి అప్పారావు తన తమ్ముడి ఇంటికి ఊట్లపల్లి వచ్చాడు. ఆతర్వాత శనివారం జంగారెడ్డిగూడెం వెళ్తున్నానని చెప్పి తమ్ముడి ఇంటి నుంచి బయలుదేరాడు. ఆదివారం అదే గ్రామంలోని చెరువులో పడి మృతి చెంది ఉండడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడిని గుర్తించిన సోదరుడు అప్పారావు ఫిర్యాదు మేరకు ఎస్సై యయాతి రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తప్పిన పెను ప్రమాదం

కామేపల్లి: ఆటోడ్రైవర్‌కు ఫిట్స్ రావడంతో అదుపుతప్పి ఆటో పల్టీ కొట్టిన ఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకోగా ఆటోలో ప్రయాణిస్తున్నవారు పెనుప్రమాదం నుంచి బయటపడ్డారు. వివరాలిలా ఉన్నాయి.. ఓ ఆటో ఖమ్మం నుంచి కామేపల్లి వెళ్తుండగా పండితాపురం బైపాస్ రోడ్డు సమీపంలో ఆటోడ్రైవర్‌కు ఫిట్స్ వచ్చాయి. ఆటో అదుపుతప్పి చెట్టును ఢీకొట్టి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఆరుగురు ప్రయాణికులు ఉండగా వీరిలో ఊట్కూర్ గ్రామానికి చెందిన రజియాకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను 108 ద్వారా ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.17,043

పత్తి కొనుగోళ్లకు సీసీఐ సై!

- ఖరారైన జిన్నింగ్ మిల్లుల టెండర్లు
- ఉమ్మడి జిల్లాలో 9 మార్కెట్ల పరిధిలో ఎంపిక
- 14 మిల్లుల్లో కొనుగోళ్లకు సన్నాహాలు
- పంట నమోదు, ఆధార్‌కు బ్యాంక్ అకౌంట్ అనుసంధానం తప్పనిసరి



జిన్నింగ్ మిల్లులో రైతు తీసుకొచ్చిన పత్తి (ఫైల్)

ఖమ్మంవ్యవసాయం: పత్తి బేళ్లకు జిన్నింగ్ మిల్లులకు టెండర్లు ఖరారు కావడంతో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) పత్తి కొనుగోళ్లకు సన్నద్ధమవుతోంది. ఇప్పటికే కొత్త పత్తి విక్రయాలు ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం పత్తి గరిష్ట ధరను రూ.7,521గా నిర్ణయించింది. 8 నుంచి 12 శాతం వరకు తేమ కలిగిన పత్తిని కొనుగోలు చేసేలా సీసీఐ విధివిధానాలు ఖరారు చేసింది. పత్తికి ప్రభుత్వ మద్దతు ధర రూ. 7,521 కాగా 15 రోజుల క్రితం ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో రూ.8,000గా పలికింది. కొత్త పత్తి రూ.7,722గా నమోదైంది. దీంతో సీసీఐ కొనుగోలు కేంద్రాల అవసరం ఉండదని అంతా భావించారు. అయితే ఆ ధర వారం కూడా నిలవలేదు. ప్రస్తుతం పాత పత్తి ధర గరిష్టంగా రూ.7,500, కొత్త పత్తి ధర రూ.7,000 ఉంది. తేమశాతం ఎక్కువగా ఉంటే వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. ఈ క్రమంలో సీసీఐ కొనుగోలు కేంద్రాల ఆవశ్యకత పెరిగింది. దీంతో ప్రభుత్వం సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేయించేందుకు కృషి చేస్తోంది.

3.77లక్షల ఎకరాలకు పైగానే సాగు..

జిల్లాలో ఈ ఏడాది 1.91 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. అయితే, వర్షపాతం సాధారణానికి మించి నమోదు కావడం పంటకు ప్రతికూలంగా మారింది. సెప్టెంబర్ మొదటి వారంలో కురిసిన భారీ వర్షాలు, వరదలతో తీవ్ర నష్టం వాటిల్లింది. పలుచోట్ల పత్తి చేలు ఆనవాళ్లు లేకుండా పోయాయి. వర్షాల కారణంగా తేమ పెరిగి పైరు దెబ్బతిన్నది. పూత, కాత దశలో ప్రకృతి వైపరీత్యం కారణంగా దిగుబడిపై ప్రభావం పడింది. గత ఏడాది అనావృష్టి కారణంగా పంట దిగుబడి తగ్గగా, ఈ ఏడాది అధిక వర్షాలతో పైరు దెబ్బతిని దిగుబడిపై ఆశలు సన్నగిల్లాయి. ప్రస్తుత పరిస్థితిలో జిల్లాలో సాగు చేసిన పంట విస్తీర్ణం ఆధారంగా 1,43,044 మెట్రిక్ టన్నుల పత్తి దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. ఇక భద్రాద్రి జిల్లా వ్యాప్తంగా 1,82,032 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. తద్వారా 1,45,175 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని భావిస్తున్నారు.

నిబంధనలు తప్పనిసరి

పంట కొనుగోలులో ప్రభుత్వం విధించిన నిబంధనలు తప్పనిసరి చేశారు. వ్యవసాయ శాఖ పోర్టల్‌లో పంట నమోదై ఉండాలి. ఇప్పటికే వ్యవసాయ శాఖ నుంచి మార్కెటింగ్ శాఖ, సీసీఐ సంస్థలు పంట నమోదు వివరాలను సేకరించింది. పోర్టల్‌లో పంట నమోదై ఉన్న రైతుల నుంచి మాత్రమే సీసీఐ జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోలు చేస్తారు. రైతులు పట్టాదారు పాస్ పుస్తకంతో పాటు ఆధార్ నంబర్‌ను బ్యాంక్ ఎకౌంట్‌తో అనుసంధానం చేసుకొని ఉండాలి. ఆ విధంగా ఉన్న రైతుల పంటను మాత్రమే సీసీఐ కొనుగోలు చేస్తుంది. ఇప్పటికే కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సీసీఐ ప్రతినిధులు, మార్కెటింగ్, వ్యవసాయ శాఖల అధికారులకు పత్తి కొనుగోలుపై దిశానిర్దేశం చేశారు.

జిల్లాల వారీగా ఇలా..

- ఖమ్మం జిల్లాలోని ఐదు మార్కెట్ల పరిధిలో సీసీఐ ద్వారా పది పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేస్తారు. మధిర, మద్దులపల్లి మార్కెట్ల పరిధిలో మూడు చొప్పున, ఖమ్మం మార్కెట్ పరిధిలో రెండు, వైరా, నేలకొండపల్లి మార్కెట్ల పరిధిలో రెండేసి జిన్నింగ్ మిల్లుల్లో పత్తి కొనుగోళ్లకు టెండర్లు ఖరారయ్యాయి.
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని నాలుగు జిన్నింగ్ మిల్లులను సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లను ఖరారు చేశారు. ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ పరిధిలోని సింగరేణి, కొత్తగూడెం మార్కెట్ పరిధిలోని సుజాతనగర్, బూర్గంపాడు మార్కెట్ పరిధిలోని లక్ష్మీపురం, భద్రాచలం వ్యవసాయ మార్కెట్ పరిధిలోని నెల్లిపాక బంజర జిన్నింగ్ మిల్లుల్లో పత్తి కొనుగోళ్లు చేపట్టనున్నారు.

మూడో వారం నుంచి కొనుగోళ్లు



ఈ నెల మూడో వారం నుంచి సీసీఐ పత్తి కొనుగోళ్లకు రంగం సిద్ధం చేస్తోంది. ఇప్పటికే జిల్లాలో కొనుగోలు కేంద్రాల ఏర్పాటు నిర్ణయం, ఆయా కేంద్రాల పరిధిలో జిన్నింగ్ మిల్లుల ఎంపిక, టెండర్ల ప్రక్రియ పూర్తి చేశాయి. తేమ శాతం ఆధారంగా నిబంధనలు అనుసరిస్తూ పత్తి కొనుగోళ్లకు సీసీఐ సన్నద్ధమవుతోంది.

– ఎం.ఏ.అలీం, మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి

కరెంట్‌తో హతమార్చేలా?

- ఒడ్డురామారం బీట్ అటవీప్రాంతంలో వన్యప్రాణుల వేట?
- నీటి తావులను లక్ష్యం చేసుకుంటున్న వేటగాళ్లు
- అటవీ జంతువులు విద్యుదాఘాతానికి గురయ్యేలా ఏర్పాట్లు
- పసిగట్టలేక పోతున్న అటవీశాఖ అధికారులు



వేటగాళ్లు ఏర్పాటు చేసుకున్న కర్ర, బైండింగ్ వైరు



వేట ప్రదేశంలో నిండా నీటితో ఎయిర్ వాల్వ్

ములకలపల్లి: అటవీ జంతువుల వధకు వేటగాళ్లు నీటి తావులనే లక్ష్యంగా చేసుకుంటున్నారు. మండలంలోని ఒడ్డురామారం బీట్ మాధారం అటవీ ప్రాంతంలో వన్యప్రాణులను వేటాడేందుకు విద్యుత్ వైర్లను అమర్చుతున్నారు. శుక్రవారం స్థానికులు గుర్తించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. మాధారం–పూసుగూడెం మధ్యలో అటవీ ప్రాంతంలో పాల్వంచ–మందలపల్లి ప్రధాన రహదారికి అత్యంత సమీపంలో విద్యుత్ తీగలు అమర్చారు. అయినా అటవీశాఖ సిబ్బంది పసిగట్టలేకపోవడం విస్మయానికి గురిచేస్తోంది.

విద్యుత్‌లైన్‌ను అనువుగా చేసుకుని..?

విద్యుత్ లైన్ అందుబాటులో ఉండడంతో ఈ ప్రదేశాన్ని వేటకు అనువుగా మార్చుకున్నట్లు తెలుస్తోంది. దీనికితోడు జీవాలు దాహార్తి తీర్చుకునేందుకు ఇక్కడ పుష్కలంగా నీటి సౌలభ్యం ఉంది. రహదారి పక్కనే మిషన్ భగీరథ ఎయిర్ వాల్వ్ ఉంది. ఇది లీకవడంతో చుట్టూ నిర్మించిన తొట్టిలో ఎల్లప్పుడూ నీళ్లు నిండి ఉంటున్నాయి. దీంతో వన్యప్రాణులు తాగునీటి కోసం ఇక్కడకు వచ్చే వీలుంది. సమీపంలోనే విద్యుత్ లైన్ కూడా ఉంది. దీంతో వేటగాళ్లు ఇక్కడే మాటేసి కరెంట్‌తో వేటను నిరంతరాయంగా సాగిస్తున్నట్లు సమాచారం.

కర్రలు గుచ్చి.. బైండింగ్ వైరు కలిపి..

అటవీ ప్రాంతంలో కిలోమీటర్ల మేర కర్రలు గుచ్చి, వాటికి బైడింగ్ వైరు కలుపుతున్నారు. రాత్రి వేళ కరెంట్ స్తంభం మీద లైన్‌కు బైండింగ్ వైర్‌ను అనుసంధానం చేసి విద్యుత్ ప్రసారమయ్యేలా చూస్తున్నారు. రాత్రి వేళ తాగునీటి కోసం వచ్చే వన్యప్రాణులు తీగలకు తగిలి విద్యుదాఘాతంతో మృతి చెందుతున్నాయి. అప్పుడు విద్యుత్ ప్రసారం నిలిచిపోతుంది. అక్కడే మాటేసి ఉన్న వేటగాళ్లు ఆ ప్రాణికి తీసుకొని ఉడాయిస్తున్నారు. ఒకవేళ రాత్రి జీవాలు రాకపోతే తెల్లవారుజామునే స్తంభం నుంచి వైర్లు తీసేసి, ఉండలు చుట్టి, కర్రల వద్ద ఉంచుతున్నారు. మరుసటి రోజు రాత్రి కాగానే కరెంట్ లైనుకు వైర్లు కలిపి వేట కొనసాగిస్తున్నారు.

ఇన్నాళ్లు అటవీశాఖ దృష్టికి రాలేదా?

పత్రికల్లో వార్తలు వచ్చిన నేపథ్యంలో మాధారం అటవీ ప్రాంతంలో ఆదివారం ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ (ఎఫ్‌ఎస్‌ఓ) హరిప్రశాంత్, సిబ్బంది పర్యటించారు. వేటగాళ్లు ఉపయోగిస్తున్న బైండింగ్ వైర్లు, కర్రలు స్వాధీనం చేసుకున్నారు. సమగ్ర విచారణ చేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ తీగలతో వేటాడుతున్న విషయం అటవీ శాఖ సిబ్బంది దృష్టికి రాలేదా, వచ్చినా వేటగాళ్లతో కుమ్మక్కై పట్టించుకోలేదా? అనే అనుమానా లు వ్యక్తమవుతున్నాయి. అటవీశాఖ రేంజ్ పరిధిలో ని బీట్లలో బీట్ ఆఫీసర్లు, సెక్షన్ ఆఫీసర్లు, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్లు నిఘా పెడతారు. నిత్యం ఆయా బీట్లలో తిరుగుతూ ఎవరైనా కలప అక్రమంగా తరలిస్తున్నారా? అటవీ జంతువులకు హాని తలపెడుతున్నారా? అనే విషయాలను గమనిస్తూ ఉంటారు. ఈ నేపథ్యంలో రహదారికి సమీపంలో కిలోమీటర్ల మేర కర్రలు గుచ్చి విద్యుత్ తీగలతో వేట సాగిస్తు న్న విషయం అటవీశాఖ అధికారుల దృష్టికి ఎందుకు రాలేదనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. కాగా ఈ విషయమై పాల్వంచ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ (ఎఫ్ఆర్ఓ) సురేష్‌ను వివరణ కోరగా..వన్యప్రాణుల వేట విషయంలో ఎవరినీ ఉపేక్షించేదిలేదని, ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు.

కార్మిక క్షేత్రంలో ఆధ్యాత్మిక శోభ..!

- ఏటా ఘనంగా దసరా ఉత్సవాలు
- సద్దుల బతుకమ్మతో పాటు రామ్‌లీలా వేడుకలు, సాంస్కృతిక కార్యక్రమాలు
- బతుకమ్మ, ఫ్యామిలీ డే పేరిట భద్రాద్రి స్టేడియంలో వేడుకలు



సింగరేణి మణుగూరు ఏరియా వర్క్‌షాప్‌లోని అమ్మవారి ఆలయం



సద్దుల బతుకమ్మ వేడుకలు(ఫైల్)



రామ్‌లీలా కార్యక్రమంలోని రావణుడి ప్రతిమ(ఫైల్)

మణుగూరు టౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. శరన్నవరాత్రి ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. దసరా వేడుకల్లో భాగంగా గనులు, విభాగాలపై కొలువైన మైసమ్మ తల్లి, కనకదుర్గమ్మ, ఓంకారేశ్వరి ఆలయాల్లో అమ్మవారు ప్రత్యేక పూజలు అందుకోనున్నారు. ఏరియాలోని 2300కు పైగా ఉన్న కార్మికులతో పాటు ఈ దఫా తొలిసారి 2700పైగా ఉన్న కాంట్రాక్ట్ కార్మికులకు సైతం విజయదశమికి దసరా బోనస్ అందనుండడంతో ఈ సారి ఉత్సవాలు అంబరాన్నంటనున్నాయి. ఇప్పటికే ఆలయాలకు మామిడాకుల తోరణాలు, మిరిమిట్లు గొలిపే విద్యుత్ లైట్ల ఏర్పాటు, రంగులద్దుకున్న ఆలయ పరిసరాలతో అమ్మవారి గీతాలతో గనులు మార్మోగుతున్నాయి.

సల్లంగ సూడాలని..

ప్రాణాలు లెక్కజేయకుండా ప్రకృతికి విరుద్ధంగా విధులు నిర్వహించే సింగరేణి కార్మికులు భూగర్భంలోకి వెళ్లిన తర్వాత, విధుల్లో ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా ఉండాలని కోరుతూ మొక్కుకుంటారు. విధులకు వెళ్లేముందు, పనులు ముగించుకుని బయటకు వచ్చిన ప్రతీరోజు అమ్మవారిని దర్శించుకోవడం ఆనవాయితీ. ఇందులో అధికారులు సైతం భాగస్వాములవడం విశేషం. ఉత్సవాలు ప్రారంభం నుంచి ప్రత్యేక పూజలతో పాటు ప్రసాదాల పంపిణీ చేస్తారు. కార్మికుల విరాళాలతో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తుంటారు. విజయదశమి నాడు వేటపోతుల బలితో పాటు గనుల్లో యంత్రాలకు, కీలక పాత్ర పోషించే పనిముట్లకు ఆయుధ పూజలు నిర్వహిస్తారు.

అలరించేలా రామ్‌లీలా..

కార్మిక కుటుంబాలతో పాటు పుర ప్రజలు, కార్మిక కుటుంబాలను ప్రోత్సహించేలా సద్దుల బతుకమ్మ వేడుకలను సంస్థ ఆధ్వర్యాన ఘనంగా నిర్వహిస్తారు. బతుకమ్మ, ఫ్యామిలీ డే పేరిట పీవీకాలనీలోని భద్రాద్రి స్టేడియంలో వేడుకలు నిర్వహించి, సింగరేణి సేవా విభాగం ఆధ్వర్యాన బహుమతుల ప్రదానం చేస్తారు. దసరా నాడు అధికారుల ఆధ్వర్యాన సినీ బుల్లి తెర నటీనటులతో సాంస్కృతిక కార్యక్రమాలు అనంతరం పురప్రజలను అలరించేలా రామ్‌లీలా కార్యక్రమం నిర్వహించి ముగుస్తారు.

కేఓసీ–2 భూ నిర్వాసితుల విజయోత్సవ ర్యాలీ



ర్యాలీ తీస్తున్న భూ నిర్వాసితులు, నాయకులు

టేకులపల్లి : కోయగూడెం ఓసీ–2 నిర్వాసితులకు హైకోర్టు తీర్పు ప్రకారం భూమి, నష్ట పరిహారం, ఉద్యోగాలు వెంటనే ఇవ్వాలని, లేకపోతే ఓపెన్ కాస్టులో పనులను అడ్డుకుంటామని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ ప్రభుత్వానికి స్పష్టం చేశారు. ఈ మేరకు హైకోర్టు తీర్పును హర్షిస్తూ ఆదివారం టేకులపల్లి మండల కేంద్రంలో కేఓసీ– 2 భూ నిర్వాసితులు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం రేపాకుల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సభలో వెంకట్ మాట్లాడుతూ.. నిర్వాసితులకు అటవీ హక్కుల చట్టం 2006 ప్రకారం నష్టపరిహారం అందడం లేదన్నారు. దీంతో వ్యవసాయ కార్మిక సంఘం, నిర్వాసితుల సంఘం ఆధ్వర్యాన గత పదహారేళ్లుగా పోరాటం చేయడంతో హైకోర్టు న్యాయతీర్పు ఇచ్చిందన్నారు. అనంతరం బేతంపూడి పీఏసీఎస్ చైర్మన్ లక్కినేని సురేందర్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మచ్చ వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యుడు అన్నవరపు కనకయ్య, ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దుగ్గి క్రిష్ణలు మాట్లాడుతూ.. ఐటీడీఏ పీఓ, కలెక్టర్‌లు హైకోర్టు తీర్పుపై స్పందించాలన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన హక్కులను కాలరాస్తూ జరుగుతున్న మైనింగ్ జరుగుతుందని తెలిపారు. భూ నిర్వాసితుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, కేఓసీ భూ నిర్వాసితుల పోరాట నాయకుడు రేపాకుల శ్రీనివాస్ మాట్లాడుతూ.. 2007లో కోయగూడెం ఓసీ–2 ఫిట్ 2,3 భూసేకరణలో పలు గ్రామాలకు చెందిన 105 నిర్వాసితుల భూమికి నష్టపరిహారం, పునరావాసం ఇవ్వకుంటే సింగరేణి సంస్థపై తిరుగుబాటు చేసి ఎకరానికి రూ.5వేల చొప్పున పంట నష్టపరిహారం, హైకోర్టు తీర్పు ప్రకారం 2012లో పునరావాసం కల్పించబడిందన్నారు. భూమి నష్టపరిహారం కోసం మళ్లీ 2016లో హైకోర్టును ఆశ్రయించగా.. ఎనిమిదేళ్ల తర్వాత హైకోర్టు తీర్పు నిర్వాసితుల పక్షాన రావడం సంతోషకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో భూక్యా రమేష్, ఈసం నరసింహారావు, కుంజా రమేష్, కడుదుల వీరన్న, పూనెం స్వామి, పూనెం చంద్రశేఖర్, దొడ్డ సంపత్ కుమార్, భూక్యా రవి,వస్రం నిర్వాసితులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో బాలిక మృతి

ఇనుప తలుపునకు విద్యుత్ సరఫరా కావడంతో ఘటన




సువర్ణ


గుండాల: ఇంట్లో ఇనుప తలుపునకు కనెక్షన్ తెగిపోయిన కరెంట్ వైరు అనుకుని ఉండడంతో ఓ బాలిక తలుపును పట్టుకోగా షాక్‌కు గురై మృతి చెందింది. మండలంలో ఆదివారం చోటు చేసుకున్న ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని వెన్నెలబైలు గ్రామానికి చెందిన ఇర్ప క్రిష్టారావు–సుమలత దంపతుల కుమార్తె సువర్ణ(12) ఆ గ్రామంలోనే 5వ తరగతి చదువుతోంది. ఎప్పటిలాగే తల్లిదండ్రులు ఆదివారం కూడా పొలం పనులకు వెళ్లారు. చుట్టుపక్కల పిల్లలతో ఆడుకుని ఇంటికి వచ్చిన బాలిక తలుపును లోపలికి నెట్టుకుని వచ్చే క్రమంలో అప్పటికే కరెంట్ వైరు అనుకుని ఉన్న ఇనుప తలుపు ద్వారా షాక్ తగిలి అక్కడికక్కడే కుప్పకూలింది. అప్పుడే మేకల కాపలకు వెళ్లిన బాలిక తాత ఇంటికి రాగా పక్కన పిల్లలు జరిగిన విషయం చెప్పగా.. కర్రతో తలుపును నెట్టి హుటాహుటిన బాలికను గుండాల ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందింది. నూతన గృహం కావడంతో కరెంట్ వైరింగ్ పూర్తి కాలేదు. దీంతో తాత్కాలికంగా కరెంట్ కనెక్షన్‌ను దర్వాజ తలుపుపై నుంచి తీయడంతో రోజు వేస్తూ, తీస్తుండగా ఆ తీగ తెగిపోయి తలుపునకు కరెంట్ సరఫరా జరిగి ఈ సంఘటన జరిగింది. గుండాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఇల్లెందు తరలించారు.

నిర్లక్ష్యానికి రెండు నిండు ప్రాణాలు బలి

- వైద్య సిబ్బంది నిర్వాకానికి తల్లీబిడ్డ మృతి
- నార్మల్ డెలివరీ కోసం యత్నించి విఫలం
- మృత దేహాలతో రోడ్డుపై ఆందోళన



రోడ్డుపై బైఠాయించిన బాధిత కుటుంబ సభ్యులు, నాయకులు



సమ్మక్క(ఫైల్)

దుమ్ముగూడెం: వైద్య సిబ్బంది నిర్లక్ష్యానికి రెండు నిండు ప్రాణాలు బలిఅయ్యాయి. డెలివరీ కోసం ఉదయం 6 గంటలకు ఆస్పత్రికి వస్తే నార్మల్ డెలివరీ కోసం యత్నించి మధ్యాహ్నం 3 గంటల వరకు వేచి చూడడంతో పరిస్థితి విషమించి తల్లీబిడ్డ మృతి చెందారు. ఈ సంఘటన మండలంలోని ములకపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. చింతకుప్ప గ్రామానికి చెందిన ఊయిక సమ్మక్క (25) మూడో కాన్పు కోసం ఆదివారం ఉదయం 6 గంటలకు ములకపాడు వైద్యశాలలో చేరింది. గత రెండు కాన్పులు నార్మల్ కాగా, మూడో కాన్పు కోసం ఆస్పత్రికి రాగా మధ్యాహ్నం మూడు గంటల వరకు నొప్పులు వస్తూ ఆగుతుండడంతో నార్మల్ డెలివరీ కోసం సిబ్బంది ప్రయత్నించారు. దీంతో పరిస్థితి చేజారడంతో 108 ద్వారా భద్రాచలం ఏరియా వైద్యశాలకు చేరే సరికి పరిస్థితి విషమించి సమ్మక్క మృతి చెందిందని అక్కడి వైద్యులు ధ్రువీకరించారు.మృతురాలికి ఇద్దరు చిన్న పిల్లలు, భర్త ఉన్నారు.

మృతదేహంతో ఆందోళన..

మృతిచెందిన సమ్మక్క మృతదేహంతో ములకపాడు వైద్యశాల ఎదుట భద్రాచలం–చర్ల ప్రధాన రహదారిపై కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, సీపీఎం నాయకుడు యలమంచి వంశీ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వీరమాచినేని వినీల్, బీఎస్పీ నాయకుడు సింహాద్రి ఆధ్వర్యాన బైఠాయించారు. దీంతో రహదారిపై భారీ గా ట్రాఫిక్ జామ్ కాగా.. బాధితులు సమ్మక్క కుటుంబానికి న్యాయం చేయాలని, నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. సిబ్బంది నిర్లక్ష్యంతో ఇద్దరు పిల్లలు తల్లిలేని వారయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఘటన స్థలానికి చేరుకున్న సీఐ అశోక్‌కుమార్ బాధితకు టుంబసభ్యులతో మాట్లాడగా.. బాధిత కుటుంబానికి నష్టపరిహారం అందజేయాలని కోరారు. దీంతో జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పడంతో ఆందోళనకారులు శాంతించారు. మృతదేహాన్ని భద్రాచలం ఏరియా వైద్యశాలలోని మార్చురీకి తరలించారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య


జూలూరుపాడు: పురుగు మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హెడ్ కానిస్టేబుల్ మల్లయ్య కథనం ప్రకారం.. మండలంలోని పాపకొల్లు గ్రామానికి చెందిన పావురాల వెంకటేశ్వర్లు(50) భార్య వెంకటలక్ష్మి గత ఏడేళ్ల క్రితమే చనిపోగా, వీరికి సంతానం లేరు. దీంతో ఒంటరివాడు కావడంతో తన సోదరుడి కుమారుడు పావురాల మహేశ్ వద్ద ఉంటున్నాడు. ఈ క్రమంలో శనివారం కొత్తగూడెంలో తన అన్నయ్య వాళ్ల ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లి ఆదివారం జూలూరుపాడు హైస్కూల్ బిల్డింగ్ వరండాలో పురుగుమందు తాగి మృతి చెందాడు. వెంకటేశ్వర్లు స్కూల్లో కింద పడి ఉండడాన్ని చూసిన పిల్లలు స్థానికులకు చెప్పగా.. వారు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ బి.రాణాప్రతాప్ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించగా అప్పటికే అతడు మృతి చెందాడు. పక్కనే ఉన్న పురుగు మందు డబ్బాను గమనించి వెంటనే మహేశ్‌కు తెలియజేయడంతో భార్య చనిపోయిన నాటి నుంచి మద్యానికి బానిస కావడంతో పాటు ఒంటరిగా జీవించలేకపోతున్నానని పలు మార్లు అంటూ ఉండేవాడని మహేష్ పోలీసులకు వివరించాడు. మహేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ పేర్కొన్నారు.

ఆవు మృతి

సుజాతనగర్: మండలంలోని సీతంపేట గ్రామంలో ఆదివారం ఓ ఆవు మృతి చెందింది. దొడ్డి రమేష్‌కు చెందిన ఆవు మధ్యాహ్నం వరకు అరక తోలింది. అనంతరం ఆవును పక్కన కట్టేసి మేత వేశారు. కొంచెం సేపటికి తర్వాత ఆవు పైకి లేవలేదు. సుమారు రూ.50 వేల విలువ చేసే ఆవును కోల్పోయానని, ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని బాధితుడు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

వచ్చీరాని వైద్యం చేసిన ఆర్ఎంపీ

గోవింద్రాలలో విషమ స్థితిలో చిన్నారి



ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్న రితిక

కామేపల్లి: ప్రథమ చికిత్సకే పరిమితం కావాల్సిన ఆర్ఎంపీలు వచ్చీరాని వైద్యం చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. మండలంలోని ఓ ఆర్ఎంపీ అవగాహన లేని వైద్యంతో ఓ చిన్నారికి ఇంజెక్షన్ చేయగా ప్రాణాప్రాయ స్థితిలో అల్లాడుతున్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని గోవింద్రాల గ్రామానికి చెందిన కటారియా అశోక్ – నిర్మల దంపతుల మూడేళ్ల కుమార్తె రితికాకు వారం రోజుల కిందట జ్వరం, దగ్గు రావడంతో స్థానిక ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లారు. ఆయన ఇంజక్షన్ వేశాడు. మరుసటి రోజు కూడా జ్వరం తగ్గక పోవడంతో మళ్లీ వెళ్లగా మరో ఇంజక్షన్ వేశాడు. అయినప్పటికీ జ్వరం తగ్గకపోగా, ఇంజక్షన్ వేసిన భాగంలో ఎర్రగా కనిపించడంతో ఆర్ఎంపీ దృష్టికి తీసుకెళ్లగా పట్టించుకోలేదు. చిన్నారిని ఖమ్మంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యులు పరీక్షించి ఇంజక్షన్ వేసిన తొంటి భాగంలో ఇన్ఫెక్షన్ అయిందని తేల్చినట్లు సమాచారం. నాలుగు రోజులుగా చిన్నారికి వైద్య సేవలు అందిస్తున్నప్పటికీ పరిస్థితి మెరుగుపడకపోవడంతో కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం చిన్నారి పరిస్థితి విషమంగా ఉందని తెలిసింది. ఆర్ఎంపీపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని చిన్నారి తండ్రి అశోక్ తెలిపారు.